ఇరుకు రోడ్డు.. ఆపై గుంతలు

- పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు
- రోడ్డు దాటాలంటే వణుకుతున్న జనం
- ప్రమాదకరంగా పెద్దమ్మగడ్డ జంక్షన్


మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత


ఇరుకు రోడ్డులో వెళ్తున్న వాహనాలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డ ప్రజలు ప్రమాదపుటంచున బతుకీడుస్తున్నారు. ఇరుకైన మార్గం.. ఆపై గుంతల మయమైన రోడ్డుపై భారీ వాహనాల రణగొణ ధ్వనులతో అవస్థలు పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా లారీలు, టిప్పర్ల రాకపోకలతో రోడ్డు దాటాలంటేనే జనం వణికిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు పట్టాకెక్కపోవడంతో పెద్దమ్మగడ్డ రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

సుమారు ఆరేళ్ల క్రితం భారీ లోడుతో వెళ్తున్న లారీ పెద్దమ్మగడ్డ జంక్షన్ నుంచి కాకతీయ యూనివర్సిటీ వైపు వెళ్లే క్రమంలో అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటన తెల్లవారుజామున జరగడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని పెద్దమ్మగడ్డ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరు.ప్రమాదానికి ప్రధాన కారణం లారీ అదుపు తప్పడమే కాదు.. పెద్దమ్మగడ్డ వద్ద రహదారి ఇరుకుగా ఉండడమూ మరో కారణం. ఇప్పటి వరకూ పెద్దమ్మగడ్డ రోడ్డును విస్తరించకపోవడం పాలకులు, అధికారులకు స్థానికుల పట్ల ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పెద్దమ్మగడ్డ జంక్షన్ నుంచి కేయూకు వెళ్లే దారి ఇరుకుగా ఉండడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోడ్డు దాటేందుకు పిల్లలు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, స్కూల్ జోన్, ప్రమాద హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ కంజర్ల మనోజ్, పెద్దమ్మగడ్డ

రోడ్డు విస్తరణ చేపట్టాలి



భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే పెద్దమ్మగడ్డ రోడ్డును విస్తరిస్తామని పాలకులు, అధికారులు కొన్నేళ్లుగా చెబుతూ వస్తున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయే బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తూ త్వరితగతిన విస్తరణ పనులను చేపట్టాలి. జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు.

– వీర రఘువీర్, పెద్దమ్మగడ్డ

నిత్యం ట్రాఫిక్ జామ్

రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం, మరోచోట ఇంటి నిర్మాణంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం భరోసా కల్పించింది. ఏమైందో తెలియదు కానీ ఇప్పటికీ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. హనుమకొండ నుంచి ములుగు, భూపాలపల్లి వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు, అటు నుంచి కేయూ బైపాస్ రోడ్డు మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలతో పెద్దమ్మగడ్డ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ సిబ్బందిని నియమించిన అధికారులు.. సిగ్నళ్ల వ్యవస్థ సరిగా పనిచేయకపోయినా పట్టించుకోవడం లేదు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి


సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ

రామన్నపేట: జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిబ్బందికి వరంగల్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు సూచించారు. నగరంలోని ఎంజీఎం, పోచమ్మమైదాన్, వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్ జంక్షన్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంజీఎం జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా పాత సిగ్నల్ పోల్స్‌ను వెంటనే తొలగించాలని, పోచమ్మమైదాన్ జంక్షన్‌లో తిరుమల ఎలక్ట్రానిక్స్ నుంచి దేశాయిపేట వైపుగా ఫ్రీ లెఫ్ట్ కోన్స్ ఏర్పాటు చేయాలని, వరంగల్ చౌరస్తాలోని భద్రకాళి డ్రెసెస్ షాపు ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణకు ప్రభాకర్‌రావు సూచించారు. అలాగే, హెడ్ పోస్టాఫీస్ కూడలిలో అండర్ బ్రిడ్జి – చౌరస్తా ఫ్రీ లెఫ్ట్ రూట్‌లో ఉన్న ట్రాఫిక్ బూత్‌ను తీసివేయాలని ఆదేశించారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ డీఈఓ కార్యాలయాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను డీఈఓ కార్యాలయాల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు కావ్య, అనూష, జిల్లా నాయకులు వంశీ, చారి, శ్రీజ, సాధన పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డివిజన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కడిపికొండలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు యోగాసనాలు



హన్మకొండ కల్చరల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం యోగాసనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ హనుమకొండ నక్కలగుట్టలోని వైబ్రంట్ జూనియర్ కళాశాల, వరంగల్ పిన్నావారి వీధిలోని శారద ఉన్నత పాఠశాలల్లో యోగాసనాల కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు పోశాల శ్రీనివాస్, టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్, వేణు శర్మ, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక




హన్మకొండ అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ మహానగర అధ్యక్షురాలిగా డాక్టర్ రోహిణి, కార్యదర్శిగా కార్తీక్ ఎన్నికైనట్లు వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్ తెలిపారు. బాలసముద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు మహానగర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ నగర అధ్యక్షుడు సంపత్, ప్రాంతాల సమితి సభ్యుడు ఆరెపల్లి సుజిత్, సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆకుపటి రాజ్‌కుమార్, నాయకులు హరిచరణ్, శ్రీకాంత్, శివ, నవీన్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ నూతన కమిటీ బుధవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట్రావు, వద్దిరాజు శ్యాంసుందర్‌రావు, పులిగిల్ల వెంకటరమణ శాస్త్రి, శ్రీధరా చారి, ఆవునూరి కుమార్, విలాసాగర్ శ్రీనివాస్, బొల్లపల్లి సరిత, సోమ అనిల్, వద్దిరాజు శ్రీనివాసరావు, కార్పొరేటర్ గుండు చందన, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, శ్రీరామ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

తప్పు చేసిన పోలీసు అధికారులను తప్పించాలి

వరంగల్ చౌరస్తా: ఏ పదవి లేకున్నా మంత్రి భర్త హోదాలో కొండా మురళీధర్ రావుకు ఏసీపీతో సహా పోలీసులు రక్షణ వలయంగా సేవలు అందించడాన్ని బీజేపీ రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మురళీధర్ రావు వరంగల్‌లో పలు అధికారిక కార్యక్రమాలతో పాటు వివాహ విందులు, వినోదాలకు వెళ్లినప్పుడు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌తో పాటు మిల్స్ కాలనీ, ఇంతేజార్ గంజ్, మట్టెవాడ సీఐలతో పాటు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్‌గా వెళ్లడాన్ని తప్పుపట్టారు. అలాంటి పోలీసు అధికారులను ఉద్యోగం నుంచి తప్పించాలని ప్రదీప్‌రావు కోరారు.

డాక్టర్ మంగారి రాజేందర్‌కు సహృదయానుబంధ పురస్కారం



హన్మకొండ కల్చరల్: వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రతియేటా అందజేసే కవి, శతావధాని, ఆశుకవి సామ్రాట్ డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా సహృదయానుబంధ పురస్కారాన్ని డాక్టర్ మంగారి రాజేందర్‌కు అందజేశారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో సంస్థ అధ్యక్షులు గన్నమరాజు గిరిజామనోహర బాబు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ వీసీ సూర్యధనుంజయ, విశిష్ట అతిథిగా జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణ, అతిథులుగా డాక్టర్ ఏవీ నరసింహారావు, వనం లక్ష్మీకాంతారావు, రాళ్లబండి నాగినీదేవి, సంవరణ్ పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి


యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో యోగాసనాలు చేయిస్తున్న యోగా గురువు

కేయూ క్యాంపస్: యోగాను ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు యోగా సాధన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ప్రాచీన కాలం నుంచే యోగాసాధన గుర్తుచేశారు. యోగాసనాలతో మానసిక, శారీర ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కవిత, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీని కలిసిన గ్రేటర్ కమిషనర్


సీపీకి పూల మొక్క అందిస్తున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ క్రైం: వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్.. సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను వరంగల్ రేంజ్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇద్దరు అధికారులు చర్చించారు.

విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలి


పూలమొక్క అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో ఇష్టానుసారంగా పెంచే ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరారు. అలాగే అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు బాబు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ చందా మల్లయ్య, చీఫ్ అడ్వైజర్ రాజేశ్వర్ రావు, నాయకుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా బీజేపీ


మార్కెట్‌లో చిరు వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న రవికుమార్


హసన్‌పర్తి: దేవస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

- వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

వరంగల్ చౌరస్తా: చిరు వ్యాపారులకు బీజేపీ అండగా ఉంటుందని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్‌లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వద్ద బుధవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్, అమృత్ కాలం, 11 ఏళ్ల మోదీ సుపరిపాలన సందర్భంగా బడుగు బలహీన వర్గాలకు కేంద్రం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను చిరు వ్యాపారులతో పాటు, కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, నాయకులు సుంచు కేశవ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, బండి సుజాత, ఉప్పుల సురేందర్, ప్రోగ్రాం కన్వీనర్ జోగు మధు, కన్వీనర్, కో కన్వీనర్ బోడకుంట్ల శివశంకర్ పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

హసన్‌పర్తి: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రచ్చబండ, యోగా దినోత్సవం, వికసిత్ భారత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో పలు మొక్కలు నాటారు. బీజేపీ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ గురుమూర్తి శివకుమార్, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో పరిష్కారం

హసన్‌పర్తి: భూ భారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీఓ రమేష్ రాథోడ్ అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా హసన్‌పర్తి రైతు వేదికలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఫ్యాషన్ కోర్సుకు దరఖాస్తులు

న్యూశాయంపేట: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్ (3 నెలల సర్టిఫికెట్) కోర్సుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గా దగ్గరలోని ఐడియల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, 98493 25271 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వివిధ కారణాలతో పలువురి బలవన్మరణం

కాజీపేట రూరల్: వివిధ కారణాలతో నగరంలో పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలు మండలం కనపర్తి గ్రామానికి చెందిన నాతి సాయికుమార్ (29)కు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. సంతానం కలగక మనోవేదనకు గురై రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పడమర కోటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పుప్పాల శ్రీకాంత్ (38) ప్లంబర్ పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను సాకుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పుప్పాల శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ వివరించారు.

ఉరేసుకొని మహిళ..

మామునూరు: అనుమానాస్పదంగా ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం సాయంత్రం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బొల్లికుంట గ్రామానికి చెందిన పసునూరి కిరణ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య కల్పన, ముగ్గురు పిల్లలను పోషిస్తున్నాడు. కాగా, కల్పన (40) బుధవారం ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం రైల్వేలైన్ అవతల వ్యవసాయ భూమి వద్ద వేపచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి (55) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గీసుకొండ ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని బుధవారం పరిశీలించారు.

అధునాతన లైఫ్ సపోర్ట్‌తో చికిత్స


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరన్

హన్మకొండ: అధునాతన లైఫ్ సపోర్ట్ ఉపయోగించి క్రిటికల్ వైరల్ న్యూమోనియా చికిత్స అందించి రోగి ప్రాణాలు కాపాడినట్లు యశోద ఆస్పత్రి ఇంటర్నేషనల్ పల్మోనాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వేశ్వరన్ తెలిపారు. హనుమకొండ కాళోజీ కూడలిలోని యశోద క్లీనిక్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన ధరావత్ సునీత తీవ్ర అస్వస్థతకు గురి కాగా, హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స అందించినట్లు తెలిపారు. తీవ్రమైన వైరల్ న్యూమోనియాతో బాధపడుతున్న ఆమెకు ప్రారంభంలో ఆక్సిజన్ మాత్రమే అవసరం అయినప్పటికీ ఆరోగ్యం క్షీణించిందని, శ్వాస ఆడకపోవడంతో పాటు ఆక్సిజన్ లెవల్స్ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని వివరించారు. ఈ స్థితిలో అత్యంత అధునాతన లైఫ్ సపోర్ట్ సిస్టమ్ ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రెన్ ఆక్సిజనేషన్ ద్వారా చికిత్స అందించాల్సి ఉండగా, తమ వైద్య బృందం నాన్ ఇన్వాసివ్, ఇన్వాసివ్ మెకానికల్ వెంటిలేషన్ ద్వారా చికిత్స అందించి రోగాన్ని నయం చేసినట్లు గుర్తుచేశారు.

యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ: దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడమే కాకుండా, రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న యాదవ జాతికి కేబినెట్‌లో చోటు లేకపోవడం సిగ్గుచేటని అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి ప్రతీక యాదవ జాతి అని చెప్పే కాంగ్రెస్ పెద్దలు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కులో నిర్వహించనున్న యాదవుల ఆత్మగౌరవ సభకు యాదవ బిడ్డలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు రాజారాం యాదవ్, అఖిల భారత యాదవ సంఘం నాయకులు గోవర్ధన్ యాదవ్, మేకల కృష్ణ యాదవ్, గిరబోయిన రాజయ్య యాదవ్, మాదం రజనీ కుమార్, సిద్దిరాజు యాదవ్, గండ్రకోట రాకేష్ యాదవ్, పృథ్వీ యాదవ్, ప్రమోద్ యాదవ్, సాయి యాదవ్, రాజు యాదవ్, బండి పర్వతాలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మతోన్మాదం.. దేశాభివృద్ధికి ఆటంకం

ఖిలా వరంగల్: మతోన్మాదం.. దేశాభివృద్ధికి ఆటంకం అని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉగ్రవాదాన్ని మత కోణంలో చూడటం సిగ్గుచేటన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట పార్టీ కార్యాలయంలో వలదాసు దుర్గయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి కులం, మతం, ప్రాంతం అంటూ పరిమితులు ఉండవని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అది ప్రమాదకరమే అని హెచ్చరించారు. దాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని గుర్తుచేశారు. సమావేశంలో గున్నాల ప్రభాకర్, మాదాసి దివ్య, ఎండీ.జుబేదా, ఉపేందర్, ఇస్మాయిల్, ఎండీ.జహీదా, ముషబీ, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

యోగా వేడుకలను జయప్రదం చేయండి

నయీంనగర్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 20న ఉదయం జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని యోగా గురువు టీవైటీసీసీ ఉమ్మడి వరంగల్ జిల్లా సెక్రటరీ పోశాల శ్రీనివాస్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక భూమి – ఒక ఆరోగ్యం థీమ్‌తో 10 ఏళ్లు పూర్తి చేసుకొని 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేట్లుగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా సాధకులు నాగిళ్ల వేణు శర్మ, జయశ్రీ, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో సంతాన లింగేశ్వర స్వామి

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయం ఆవరణలోని సంతానలింగేశ్వర స్వామిని శివ, గణేశుడి ఆకారంలో అర్చకులు బుధవారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. మహాశివుడికి 21 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. శివుడిని గణపతిగా అలంకరించి సహస్రాదిక ఉండ్రాళ్లు, మోదకాలు, నారికేళ జలంతో నివేదించారు. అనంతరం అన్నపూర్ణ భవనంలో భక్తులకు మహాన్నదానం చేశారు. ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణశర్మ వరుణహోమం జరిపించారు.

కలెక్టర్ స్నేహ శబరీష్‌కు శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: ఇటీవల హనుమకొండ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్‌ను పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా బాధ్యులు రామంచ భిక్షపతి, నాగవల్లి అశోక్, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, కాశీనాథ్, పురుషోత్తం, శ్రవణ్, ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, దళపతి, కుమారస్వామి, పరశురాములు, వేణు, సంపత్‌కుమార్, రాములు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

కేయూ క్యాంపస్: హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు రాజ్‌కుమార్ పాల్గొని పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి పాల్గొని మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, వివేకానంద, ప్రవీణ్‌కుమార్, వాసన్ ఐకేర్ సిబ్బంది కిరణ్, చేతన్ కుమార్ పాల్గొన్నారు.

అక్కడే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సీఆర్‌పీఎఫ్ వినియోగించుకున్న స్థలంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. కేయూలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ కేయూ ప్రధాన కార్యదర్శి పవన్‌కల్యాణ్, దీక్షిత్‌రెడ్డి, శంకర్, మోక్షజ్ఞ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ జారీ

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 35వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ఓసిటీలోని బల్దియా కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ ప్రసునారాణి బుధవారం జారీ చేశారు. రెవెన్యూ అధికారి బాషబోయిన శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ వినీల్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుక్క రాజు, మాధవి, నాయకలు దేవర్ల జంపా, పోగుల విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం 43వ డివిజన్ మామునూరులో ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం భూమిపూజ జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, ఏఈ పావని, స్పెషల్ ఆఫీసర్ ఎండీ.ఫూర్ హాజరై ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు అమల, కిషోర్, అనిత, జాన్సన్, శోభన్‌బాబు, నాయకుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు సన్మానం



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్‌కుమార్ జైన్‌ను కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సికింద్రాబాద్‌లో బుధవారం సన్మానించారు. ఈ నెలలో అరుణ్‌కుమార్ పదవీ విరమణ పొందనున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియన్ సెంట్రల్ కార్యాలయంలో జీఎంకు ఆత్మీయ సమ్మేళన సభ బుధవారం జరిగింది. కాజీపేట నుంచి మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల నాయకులు రైల్‌లో తరలివెళ్లినట్లు మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ ఎస్‌కే.జానీమియా, పాక వేదప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, వేదప్రకాష్, జి.రాజేశ్వర్‌రావు, భాస్కర్‌రెడ్డి, తిరుపతి, జి.నాగరాజు, వి.యాదగిరి, పాక రవి, రవీందర్, రజాక్, దినేష్ సాంబయ్య, శంకర్, జి.రాజలింగం, ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేయూలో ఆర్ఓ వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పలు చోట్ల విద్యార్థుల సౌకర్యార్థం ఏడు ప్యూరిఫయర్ ఆర్ఓ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటుచేశారు. బాల వికాస, కేయూ సంయుక్తంగా ఏడు యూనిట్లకు రూ.9 లక్షల 80వేలు వెచ్చించాయి. ఇప్పటికే యూనివర్సిటీలో నాలుగు చోట్ల ఆర్ఓ వాటర్‌ప్లాంట్లను ప్రారంభించారు. మరో మూడు వాటర్ ప్లాంట్లను గురువారం ప్రారంభించనున్నారు. యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ హాస్టల్, పద్మాక్షి మహిళా హాస్టల్, సుబేదారిలోని యూనివర్సిటీ లా హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను వీసీ ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు గురువారం ప్రారంభించనున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, లా హాస్టల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చల్లా శ్రీనివాస్ తెలిపారు.